# మార్కులవేట

స్కూలుకు వేసంగి శెలవులిచ్చి అప్పుడే పదిహేనురోజులు దాటినా, "సెలవుల్లో ఇన్ ఛార్జి" అంటూ ఒక అధికారంలేని పెత్తనం నెత్తిన బడటంవల్ల నాకు ఊరువిడిచి వెళ్ళే అవకాశం లేకుండాపోయింది. అలవాటు ప్రకారం ఆరోజు సాయంత్రం స్టేషన్ వైపువెళ్ళాను. అప్పుడే రైలుకూడా వచ్చింది. బండి ఇంకా ఆగకముందే ఒక పెద్దమనిషి ఒక పెట్టెలోనుంచి ప్లాట్ ఫారంమీదకు దూకి బోక్కబోర్లపడటం కాస్తలో తప్పించుకుని. పరుగెత్తుకుంటూ గేటువద్ద టిక్కెట్ కలెక్టరును గూడా గమనించకుండా స్టేషన్లోని ఆవరణలోకి దూసుకువచ్చి ఒక బెంచీమీద కూర్చోటం గమనించాను. ఇతనెవరో రైల్వే జామాత లాగున్నాడని (అంటే టిక్కెట్ లేని ప్రయాణీకుడు) అతనికేసి చూద్దునుగదా! ఎవరో కాదు మా మోహనరావే! బాల్య స్నేహంవల్లనైతేనేమి, కలిసి కాలేజీలో చదవటంవల్లనైతేనేమి, ఇద్దరి వృత్తీ ఒకటే కావటంవల్లనైతేనేమి, నాకత్యంత ఆప్తుడైన మోహనరావు! ప్రాణం లేచివచ్చినట్లైంది.


"మోహనరావ్! మోహనరావ్!" అని పిలుస్తూనే దగ్గిరకెళ్ళాను. కాని అతను నాకేక వినిపించుకోలా. అతని దృష్టంతా రైలు వద్దమూగిన ప్రయాణీకులపైన కేంద్రీకృతమై వున్నట్లు గమనించాను. చమటలు కక్కుతున్న అతని శరీరం, భయావహమైన అతని ముఖం, ఆబిత్తర చూపులూ చూస్తే - అప్పుడే జైలునుంచి పారిపోయి వచ్చిన దొంగవాలకం లాగున్నది అతని వేషం. అతని విచిత్రప్రవర్తనకు కారణం ఊహించలేక ఒక నిముషంసేపు నిలబడ్డాను. ఇంతలో రైలు కదిలి ప్లాట్ ఫారమ్ దాటి వెళ్ళిపోయింది. "అమ్మయ్యా!" అంటూ నావైపుకు తిరిగాడు మోహనరావు. కుశలప్రశ్నలతో ఐదు నిముషాలు గడిచింది. ఎండిపోయిన పెదిమలతోనే ఏవో సమాధానా లిచ్చాడు. అత నన్న "అమ్మయ్యా"కు కారణ మేమిటని అడిగాను. తన్నో శనిగ్రహం వెంటాడుతోందని చెప్పాడు. అది అప్పుడే తనను వొదిలిపోయిందిట. అందుచేత 'అమ్మయ్యా!' అనుకున్నాడుట! కాస్త స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటే గాని ఆపైన వివరించి చెప్పలేనన్నాడు.

ఆరాత్రి భోజనాలయ్యాక మిత్రులిద్దరం కాలవగట్టువైపుకు బయలుదేరాము. పిండారబోసినట్లు వెన్నెల. మందంగా మలయమారుతం మైమరపించే హాయి నిస్తున్నది. ఇద్దరం ఒకచోట ఆసీనులయ్యాం. మోహనరావు తన విషాదగాథ వినిపించాడు:

"స్కూలుపంతులు కెప్పుడూ సుఖముకల్ల. అన్న కవిసూక్తి జ్ఞాపకానికొస్తోంది నాకు. బడి వున్నన్నాళ్ళూ అధికారుల తనిఖీలు, స్కూలుఫైనల్ పరీక్షలకు వాచర్లుగా వెళ్ళటం, ఎలక్షన్ డ్యూటీ మొదలైన వాటితో సతమతమైనాం. ఇహ సెలవలన్నా కాస్త హాయిగా గడుస్తయ్యా అనుకుంటే, అదీ లేకుండా, పేపర్లు దిద్దే పితలాటకం ఒకటి! త్వరగా వొదిలించుకుందామని (కరెక్షన్) పని కుపక్రమించాను. ఈ సువార్త ఎక్కడెక్కడివారికీ ఎట్లా తెలిసిందో మరి! మరునాటినుంచే ప్రారంభమైంది నామీద మార్కులవేట. ఇంట్లో వున్నంతసేపూ ఇంటాయనో పొరుగింటాయనో, ఎదురింటాయనో తయారు. 'మావాడు మూడవ సంవత్సరం, కాస్త దయవుంచండి' అంటూ ఒకరూ, 'ఒక్క ఇంగ్లీషులోనే మా వాడికి కాస్త అనుమానం, ఎట్లాగైనా మీరు కాస్త పుణ్యంగట్టుకోవాలి' అంటూ మరొకరు. ఇహ ఇంటిపని మనిషి, చాకలి, మంగలి, ఇత్యాదులంతా అమ్మగారి సిఫార్సులతో సహా అర్జీలు! మేనల్లుడనో, బావమరదనో, ఏదో ఒక తాత్కాలికపు చుట్టరికంతో ప్రవేశించేవారు. వీరివల్ల పనిసాగకపోగా తిండితింటానికి కూడా తీరిక చిక్కేది కాదు. ఇహ బజారు కొద్దామంటే భయమేసేది! వాకిట్లో అడుగు బెట్టటం ఆలస్యం - అడుగడుగుదండాలవాడా, ఆపద మొక్కులవాడా, అన్నట్లయ్యేది నాపని. ఎరిగినవాళ్లు, ఎరగనివాళ్లు, చిన్నలూ, పెద్దలూకూడా దణ్ణాలు పెడుతుంటే మనస్సుకు చాలా కష్టమేసేది. కాస్త కాఫీ తీసుకుందామని హోటల్ కెడితే, అక్కడా ఇంతే! ఎన్నడూ లేని ఆదరణ! అడగనివి కూడా తెచ్చిపెట్టటం, ప్రొప్రైటరు గారే ప్రక్కన కూర్చుని, "ఫరవాలేదు ఆరగించండి" అంటూ బలవంతం చేయటం, అనంతరం - చావుకబురు చల్లగా వొదిలినట్లు—'మా అబ్బాయి నంబరు 132, ఏదో కాస్త కనిపెట్టిచూడం" డని చెవులో వూదటం. అటు ఆత్మద్రోహానికిగాని, ఇటు మిత్రద్రోహానికిగాని మనస్కరించక "చూస్తా"నని మాత్రం సమాధానం చెప్పి నేను బైటబడటం. ఇట్లా నాలుగురోజులు సౌమ్యంగా గడిచినై.

కాని ఐదోరోజునుంచి పరిస్థితులు వేరొకరూపం దాల్చినై. ఏమంటే, నాకు తెలియకుండానే అనేక సరుకులు సామాగ్రి ఇంటికి రావటం, అవి నేను పంపినవేమోనని ఇంట్లోవాళ్ళు గ్రహించటం, ఇల్లు చేరగానే నేను తిరిగి వాటిని బైటబెట్టించి, నాకోసం అప్పటిదాకా మాయింటి మొత్తలలో వేచివుండే దాతలకిచ్చి మర్యాదగా పంపించివేయటం. ఆ మామిడిపండ్ల గంపలు, ఆ అరటిగెలలు, నెయ్యి, పెరుగు, కూరగాయలు తిరిగి ఇచ్చేస్తుంటే ఇంట్లోపిల్లలు ఒకటే గొడవ చెయ్యటం, వాళ్లను సముదాయించేసరికి తాతలు దిగిరావటం. షాపులో అడిగితే పంచదార స్టాకు లేదన్న షాపు కారు, ఇంటికి నాలుగు వీశలు మనిషినిచ్చి పంపటం!' పథ్యానికికూడా గోధుమలు దొరకవన్న పెద్దమనిషి, పావుబస్తా గోధుమలు ఇంటికి పంపటం, వాటిని తిరిగి పంపినందుకుగాను నాకు కూలి దండుగ మిగలటం - మహా చిరాకు వేసేది.

ఇట్లావుండగా ఒకనాడు, మా పాలకసంఘ సభ్యుడే ఒకాయన మాయింటివద్ద ప్రత్యక్షమయ్యాడు. మామూలుగా ఎవరి దర్శనంకోసం నాబోటివాళ్ళు రోజుల కొద్దీ పడిగాపులు కాయాలో, ఎవరి గుప్పిట్లో మన పంచప్రాణాలూ వుంటాయో,



"మీ వెంట ఒక శనిగ్రహం వొస్తోంది. ఆగ్రహం కంటబడ్డారంటే అపాయం" అన్నాడాయన నాతో రహస్యంగా.

ఆ పెద్దమనిషే, తానై మాయింటికి రావటం —నాకొక అగ్నిపరీక్ష యిపోయింది. వారి వాలకాన్నిబట్టి వారొచ్చినపని మార్కుల వేటని ఇట్టే గ్రహించగలిగాను. వార్ని సుఖాసీనుల్ని చేసి మౌనంగా నిలబడ్డాను. ఆయన తన జేబులోనుంచి ఒక లిస్టుదీసి, నా కందించి, 'ఇవి మాకు కావాల్సిన నంబర్లు. వాటిసంగతి కాస్త చూసి పెట్టండి' అన్నారు అధికారస్వరంతో. అందరికీ చెప్పినట్లు గాకుండా, ఆయనకు కొంచం వినయంగా చెప్పాను. 'చిత్తం, అల్లాగే చూస్తాను' అని కాని అంతటితో ఆయన తృప్తిపడితేనా! తను స్వయంగా వచ్చిందీ, పని పూర్తిచేయించుకుపోవడానికేనట! గట్టి చిక్కే వొచ్చింది. అజ్ఞ శిరసావహించక తప్పదనుకున్నాను. కాని ఆత్మగౌరవం పొడుచుకొచ్చింది! వ్యక్తిత్వాన్ని చంపుకుని, ధర్మాన్ని త్యజించటమేనా అని. 'ప్రస్తుతం అది సాధ్యపడదని ధైర్యంగా చెప్పగలిగాను. వారికి కొద్దిగా కోపం వచ్చినట్లుంది—నాకో చిన్న ఉపన్యాస మిచ్చారు—నౌకరీ ఖాయం, ఇంక్రిమెంటు, ప్రమోషన్ ఇత్యాది ఎరలతో ప్రారంభించి, సంజాయిషీ, ట్రాన్సఫర్, శ్రీముఖం మొదలైన బెదిరింపులతో ముగించారు. అట్టి విషమావస్థకుకూడా లొంగిపోని మనోబలాన్ని ప్రసాదించినందుకు భగవంతునికి హృదయపూర్వకాభివందనా లర్పించుకొన్నాను. కాని ఎన్నాళ్ళిలా ప్రవాహంలో ఎదురీత! దినదిన గండం నూరేండ్లాయుష్షు. ఇంక అక్కడ వుండటం క్షేమకరం కాదనుకుని, సతీసమేతంగా అత్తారింటికి ప్రయాణమయ్యాను. అంతవరకు మామగారు సెలవల్లో బందరు రావలసిందని పంపిన ఆహ్వానా లన్నింటినీ తీరిక లేదంటూ తిరగ్గొట్టేశానే అన్న విషయం మనస్సులో బాధిస్తోనేవుంది. కాని విధి! తప్పించటం నాతరమా! రెండవ కంటివాడికి తెలియకుండా తెల్లవారుఝాము బండికి 'స్టేషన్ చేరుకున్నాము. ఆ బండికి దిగే చుట్టాలకోసం నిరీక్షిస్తున్న మా మేష్టరుగారొకరు కనిపించారు. అవీ యివీ మాట్లాడుకున్నాక, రహస్యంగా అన్నా డాయన నాతో 'మీ వెంట ఒకశనిగ్రహం వొస్తోంది.

# మార్కులవేట

ఆ గ్రహం కంటబడ్డారంటే అపాయం! తప్పించుకుంటే అదృష్టవంతులు' అని. అంటే నేను బందరు చేరగానే, నా ఉద్యోగానికి శ్రీముఖం చూపించి నన్ను లొంగదియ్యాలని వీళ్ళవుద్దేశ్యం! సరే ననుకున్నాను. రైలు రాగానే మేమొక పెట్టెలో ఇరుక్కుని కూర్చున్నాము. బండి కదిలింది. ప్రతిస్టేషన్లోనూ ఒక వ్యక్తి మాకేరేజివద్దకొచ్చి నేనున్నానో లేదో చూసి వెళ్ళటం గమనిస్తూనే వున్నాను. రైలు బెజవాడ చేరే లోపలే ఒకవుపాయం ఆలోచించా. మా వాళ్ళను మాత్రం బందరు పంపించి నేనీవూరు వొచ్చెయ్యాలని నిశ్చయించుకున్నాను. రైలు బెజవాడ చేరింది. మా వాళ్ళకు నాప్లానంతా చెప్పి, నన్ను వెంటాడుతున్న వ్యక్తి మా పెట్టె చేరకముందే, ప్లాట్ ఫారమ్ లేని వైపునుంచి బండిదిగి, అప్పుడే బయల్దేరబోతున్న ఈ రైలెక్కాను. ఆ గ్రహం ఒకవేళ నా వెంటపడ్డా, నేనిక్కడ దిగటం గమనించకుండా వుండేందుకని, రైలు పూర్తిగా ఆగకముందే దిగేసి వచ్చి స్టేషన్లో కూర్చుని రైలుదిగిన వాళ్ళందరినీ పరీక్షగా చూశాను. ఆ గ్రహం మాత్రం కనబడలేదు. అప్పటికి నామనస్సు కుదుటబడ్డది. ఎట్లాగైతే నేమి శ్రీముఖం తప్పిపోయింది గదా అని 'అమ్మయ్యా' అనుకున్నాను. అంతే!" అని ముగించాడు మోహనరావు.

"శ్రీముఖం సంగతెట్లా వున్నా, రైలు క్రింద పడకుండా తప్పించుకున్నావు. ధన్యవాదాలు"-అన్నాను.

మరునాడు మోహనరావు కొక ఉత్తరం వొచ్చింది. అది చదువుకొని అతను పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుతుంటే ఏమిటి విశేషమని అడిగాను. "నిన్న మా వెంటబడ్డది ఆ శనిగ్రహం కాదుట! మా కుటుంబాన్ని తీసుకురమ్మని మామగారు పంపిన మనిషిట!! మేము బయలుదేరినరాత్రే మావూరువొచ్చి, పొద్దుపోయిందని స్టేషన్లోనే పడుకున్నాట్ట. తెల్లవారుఝామున మేము రైలెక్కటం చూసి, హడావిడిగా లేచి తనూ రైలెక్కాట్ట!" అన్నాడు మోహనరావు. 'చాలా బాగుం'దన్నాను; మోహనరావు ధైర్యస్థైర్యాలను మెచ్చుకుంటూ. ★

ఫోటో మార్కు పరిమళ వక్క పొడి
మంచి వాసనలతో తయారుచేసినది.
చాలా శ్రేష్ఠమైనది.



15 తులములు గల ప్యాకెట్లులోను ఒక మణుగు గల టిన్నులు లూజుగను చాలా అనుకూలమైన ధరలతో F. O. R. మదరాసు డెలివరికి సప్లయి చేయగలము. పర్లాకిమిడి, రాజమండ్రి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి యింకా అనేకమైన చోట్లలో చాలా ప్రసిద్ధి జెందినది. ఇంకా వక్కలు అనేకమైన రకములు చాలా సరసమైనధరలకు పంపగలము.

A. సుబ్రాయులు శెట్టి & సన్స్,
132, ఆదియప్ప నాయక్ వీధి, జి టి మద్రాసు.
టెలిగ్రామ్: "SUPERIOR" టెలిఫోన్ : 4764.




కుష్ఠు ★ బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.